# నాకు నచ్చిన నా కథ



సి. యస్. రావు

నేను రాసిన కథలలో నాకు బాగా నచ్చిన కథ 'గుమ్మడి గింజలు', ఆంధ్ర జ్యోతి వారపత్రికలో చాలా కాలం క్రితం ప్రచురించబడింది.

ఒక సంఘటనను కథగా చిత్రీకరించడం సులువే. కాని ఒక సిద్ధాంతాన్ని కథారూపంలో చెప్పడం కొంత కష్టమైన పని. ఒక సిద్ధాంతాన్ని వ్యాసంలో చెప్పవచ్చును. కాని కథలో చెప్పాలంటే తగిన సంఘటనలను సృష్టించుకొని విసుగు కలిగించకుండా చెప్పాలి. అదే యీ కథలోని ప్రత్యేకత. 'కాదేదీ కవితకనర్హం' అన్నట్టే 'కాదేదీ కథకు అనర్హం' అనడం అతిశయోక్తి కాదు. కాకపోతే చెప్పే తీరూ, ఉపాది కథకుడికి వుండాలి.

కథా, కథానిక ఇంగ్లీషు సాహిత్యంలో పెరిగిందనీ, ఫ్రెంచి సాహిత్యంలో పెరిగిందనీ కొందరు అంటూ వుంటారు. కాని కథ చెప్పడం తెలుగువారి సొత్తని నా విశ్వాసం. తెలుగువారు అమ్మమ్మ దగ్గరనుంచి కథ నేర్చుకుంటారు. నాయినమ్మ, అమ్మమ్మ కథచెప్పి పిల్లల్ని నిద్దరపుచ్చుతారు. పిల్లలు తోచకపోతే కథలు చెప్పుకుంటారు.

తెలుగు కథలో వస్తువైవిధ్యం, శిల్పం ఉన్నత ప్రమాణాలలోనే వుంటాయి.

తెలుగు రచయితలు కూడా యీనాడు వస్తువును బట్టి చెప్పే తీరునూ, శిల్పాన్ని, భాషనూ ఎన్నుకొని రచనారీతిలో కొత్త పుంతలు తొక్కుతున్నారు.

పద్ధతులు, టెక్నిక్‌లూ ఎంత పెరిగినా, బలమైన వస్తువు కథకు అవసరం..

# గుమ్మడి గింజలు

రెండు మేరుపర్వతాలు వియ్యమొందుతున్నాయి. ఆ రెండు పర్వతాలనూ అంటిపెట్టుకున్న రాళ్ళకు రప్పలకు ఎక్కడలేని హడావుడిగానూ వుంది.

మునిపల్ ఛైర్మన్ పాపారావు పక్కవూరి షుగర్ ఫ్యాక్టరీ యజమాని రావుజీతో వియ్యమొందుతున్నాడు, అందుకే ఆ మునిసిపాలిటీని అంటిపెట్టుకున్న జనానికి, షుగర్ ఫ్యాక్టరీని అంటిపెట్టుకున్న జనానికి నెలరోజులనుంచి ఎక్కడలేని హడావిడీను.

ఛైర్మన్ పాపారావుగారి అమ్మాయిని షుగర్ ఫ్యాక్టరీ ప్రొప్రయిటర్ రావుజీగారి అబ్బాయి కిస్తున్నారు. రావుజీ తన మందీమార్బలంతో రెండు బస్సులలోను, రెండు లారీల్లోనూ, ఎనిమిది చిన్న కార్లలోను తర్లొచ్చారు. ఛైర్మన్ పాపారావు ఏర్పాటుచేసిన విడిదిలో దిగారు. మగపెళ్ళివారు విడిదికీ ఆడపెళ్ళివారింటికీ ఒక ఫర్లాంగు దూరంకూడా వుండదు. అయినా ఆ రెండిళ్ళ మధ్య కారులు కాళ్ళరిగేలా తిరుగుతున్నాయి.

మగపెళ్ళివారు కాఫీ ఫలహారాలు సేవించి మధ్యాహ్నం భోజనాలదాకా కాలక్షేపం కావటంకోసం ఎవరి గొడవల్లో వాళ్లు మునిగిపోయారు.

విడిదిలో లోపల గదుల్లో ఆడవాళ్ళంతా తమ తమ బంధువులు గురించి, జరిగిపోయిన పెళ్ళిళ్ళ గురించి, అక్కడ జరిగిన మర్యాదల గురించి, ఇక్కడ జరుగుతూన్న మర్యాదల గురించి ముచ్చటించుకుంటున్నారు.

మగవాళ్ళంతా ఎదుటి హాల్లో తమతమ హోదాలకు తగ్గట్టు ఆసీనులయ్యారు. లోపలి గదుల్లోని ఆడవాళ్లుకూడా గుంపులు గుంపులుగా విడిపోయారు.

రావుజీగారు భార్య వరలక్ష్మి దేవిగారు. ఆవిడ చుట్టూ వారి దగ్గర బంధువులు, సంపన్న కుటుంబాలకు చెందిన ఆడవారు చేరారు.

ఫ్యాక్టరీలో పనిచేసే గుమాస్తాల భార్యలు, ట్రేడ్‌యూనియన్ లీడర్ నరసయ్య భార్యా వేరే గుంపుగా గుమిగూడారు. వీళ్ళు గట్టునపడ్డ చేపల్లా వున్నారేగాని పెద్దవాళ్ళ గుంపులోకి చేరలేకపోయారు.

ఇంతలో రావుజీ "ఏమిటండీ అంతా అలా మౌనంగా వుండిపోయారే? కాసేపు కార్డ్స్ వేద్దామా?" అన్నాడు సమితి ప్రెసిడెంటు జోగారావుని. ఎం. ఎల్. ఏ. వరహాలరాజుని వుద్దేశించి.

"మీరా మాట యింకా అనటంలేదేంవా అనే చూస్తున్నాం" అన్నాడు ఎం. ఎల్. ఏ. వరహాలరాజు.

"మనం ఎం.ఎల్.ఏ. గారికి అసలు కాళీగా కూర్చోవడం అంటేకిట్టదు. మీదే ఆలస్యం" అన్నాడు నవ్వుతూ ప్రెసిడెంటు జోగారావు.

"మనం ముగ్గురమేనా?" అన్నాడు ఎం. ఎల్. ఏ.

"అటుండాలేగాని జనానికి లోటేవుందండీ? మా పార్టనర్ శేషగిరి వున్నాడు. ప్లాంట్ యింజనీరుగారున్నారు, మేనేజరుగారున్నారు."

"అమ్మమ్మ. నన్ను కలపకండి, పెద్దలు, మీతో నేనెక్కడ తూగగలను. మీస్టేకు నేనెక్కడాడగలను" అన్నాడు మేనేజరు భద్రం వినయంగా.

"సరే మనం ఐదుగురం చాల్లే" అంటూ "ఓరేయ్ ఖానూ? లోపల సూట్ కేసులో పేక లుంటాయి తీసుకురా, మీ అక్కయ్యనడిగి పర్సుకూడా తీసుకురా" అని ఆర్డరు జారీచేశాడు రావుజీ.

– ఆట ప్రారంభం అయింది.

"స్టేకు ఎంత పెడదాం?" రావుజీ అడిగాడు.

"మీ యిష్టం," వరహాలరాజు సమాధానం.

"వన్ టు నా?" రావుజీ అన్నాడు.

"కానివ్వండి?" యింజనీరు అంగీకరించాడు.

వరండాకి మరో చివర వాళ్ళకున్న బట్టలలో మంచివి ఏరుకుని ధరించిన గుమస్తా జనం వాళ్ళ కవతల ట్రేడ్ యూనియను లీడరు నరసయ్య పట్టాలమీద నడుములు వాల్చారు అప్పటికే.


పేకముక్కల చప్పుడు విని ఓ గుమాస్తా లేచి "మనం కూడా వేద్దామేమి టిక్కడ?" అన్నాడు.

"ఏమిటి?" మరో గుమాస్తా ప్రశ్న.

"పేకే – ఇంటర్నేషనల్."

"అసలీ పెళ్ళి నెలాఖరులో వచ్చినందుకే విసుక్కు చస్తున్నాం లోలోపల. ఉన్న పదో పదిహేనో యీ ఆటలో జారిపోతే కుర్రవెధవలు ఏదేనా కావాలని మారాంచేస్తే దిక్కుమొగం పెట్టుక్కూర్చోవాలి. ఎందుకొచ్చిన గొడవగాని కళ్ళు మూసుకుని పడుకో భోజనాలకు పిలిచేదాకా?" ఉన్న యిబ్బంది వివరించి తన నిర్ణయం చెప్పేశాడు ఓ గుమాస్తా. "యింతకీ వాళ్ళాడేది స్టేకెంత?" అన్నాడు మరో గుమాస్తా తెలుసుకోవాలన్న కుతూహలంతో.






"ఒన్ టు."

"పైసలా?"

"కాదు, బీడీలు. ఏ కాలంలో బతుకుతున్నావోయ్ నువ్వు. పైస లాడ వలసిన కర్మ వాళ్ళకేం పట్టింది? అది నీకూ నాకు స్టేకు. వాళ్ళాడేది రూపాయలు" అన్నాడు హెడ్ గుమాస్తా.

ఈ గొడవలేమీ పట్టించుకోనట్టు పేపరులో మునిగిపోయున్నాడు యూనియన్ లీడర్ నరసయ్య.

గుమాస్తాల పిల్లలు, నరసయ్య కొడుకు రవి, రావుజీగారి ఏడసారపు కొడుకు చిట్టిబాబు హాలు మధ్యలో ఏదో ఆడుకొంటున్నారు

రావుజీగారబ్బాయి చిట్టిబాబు చూడముచ్చటగా వున్నాడు. తరచు ఏపిల్స్ తింటాడేమో, ఏపిల్ పళ్ళలాంటి బుగ్గలు, వుంగరాల జుట్టు, బలమైన పిక్కలు, గుండ్రని జబ్బలు పదేళ్ళ పిల్లవాడిని పధ్నాలుగేళ్ళ వాడిలా కనిపింపచేస్తున్నాయి.

ఇంతలో పేకాట టేబుల్ దగ్గర కలకలం.

"డీల్ షోయే?" అన్నాడు యింజనీరు.

"ఎం.ఎల్.ఏ. గారంటే ఏమిటనుకున్నారు మరి?" అన్నాడు సమితి ప్రెసిడెంటు "తొంభైంమూడూ" అని లెక్కపెట్టి ఓకులు.

"ఏమిటయ్యా హేట్రిక్ కొట్టావు.. నీది హేట్రిక్కు – నావి మూడూ కౌంటులే" అన్నాడు రావుజీ.

"మీరు కూడా అలా అంటారేమిటి సార్! ఆఫ్టరాల్ మూడు కౌంట్లకి, అన్ లక్కీ ఎట్ కార్డ్స్: లక్కీ ఎట్ లవ్" అన్నాడు యింజనీరు.

"యీ వయస్సులో నాకు లవ్వేమిటయ్యా?"

"లవ్‌కి వయసేమిటండీ. స్టేషన్ కావాలిగాని," అన్నాడు పార్టనర్ శేషగిరి.

"మన లవ్ మాటకేంగాని మన ఎం. ఎల్. ఏ. మాత్రం లక్కీ మేన్ అండి" అన్నాడు రావుజీ.

"కాదు మరీ! హేమాహేమీలుండగా ఆయనకు టిక్కెట్టు పార్టీ తరఫున దొరకడం పెద్ద లక్కు. టిక్కెట్టు దొరికాక పెద్ద మెజారిటీతో నెగ్గడం రెండవ లక్కు." అన్నాడు సమితి ప్రెసిడెంటు.

"నాదేంవుందండీ. అంతా ఆ దేవిచలవ, మీలాంటి పెద్దల ఆశీర్వాదం" అన్నాడు వినయంగా ఎం.ఎల్.ఏ.

వరలక్ష్మీదేవి లోపలినుండి వచ్చి "చూడండి. నేనోసారి ఆడపెళ్ళివారింటికి వెళ్ళొస్తాను. వదినగారు కబురంపించారు పెళ్ళికూతురు బట్టలు, బాలతొడుగు చూడ్డానికి" అన్నారు రావుజీ నుద్దేశించి.

"సరే వెళ్ళిరా" అన్నాడు రావుజీ ముక్కలు కలుపుతూ.

"అమ్మా నేనూ వస్తానే" అంటూ వెంటపడ్డాడు చిట్టిబాబు.

"సరే పద" అంటూ కారు దగ్గరకు నడచింది వరలక్ష్మీదేవి.

కారు ఆడపెళ్ళివారింటి పోర్టికోలో ఆగగానే ఛైర్మన్‌గారి భార్య పరిగెత్తుకొచ్చి "వచ్చారా! రండి; రండి;" అంటూ డోరుదగ్గర కొచ్చింది. డ్రైవరు కంగారుగా డోర్ తెరిచాడు. వరలక్ష్మీదేవి ఠీవిగా కారు దిగారు చిట్టిబాబుతో సహా.

"మీ రింకా రాకపోవడంతో నేనే బయలుదేరి వద్దామనుకుంటున్నాను. కాని ఉన్న రెండు చిన్నకార్లలోను ఒకటి మీ దగ్గరకు పంపించానా, యింకొకటి యస్.పి. గారి శ్రీమతిని తీసుకురావడానికి వెళ్ళింది. మిగిలిన ఈ మునిసిపాలిటీ జీపులు, వేన్‌లు వున్నాయిగాని ఎందుకనో అవి నాకు ఉపయోగించబుద్ధి కాదండి!" అంది వియ్యపురాలు గుక్కతిప్పుకోకుండా.

"మీ రింకా నయం. నా పరిస్థితి మరీ అధ్వాన్నం. మా చెవర్లెట్ తప్పితే మరోటి నా కసలు పడదు. కర్మం చాలక తప్పనిసరై ఒక గంట మరో కారులో ప్రయాణంచేస్తే సాయంత్రానికి జ్వరమే వచ్చేస్తుంది నాకు" అన్నారు వరలక్ష్మీదేవి మగపెళ్ళివారి దర్పాన్ని చూపెడుతూ. "రండి ఆ అమ్మాయికి కొన్న పట్టుచీరలు చూద్దురుగాని" అంటూ పెళ్ళికూతురు గదిలోకి దారితీసింది ఛైర్మన్‌గారి భార్య.



బట్టలు నగలు ఆవిడముందు పరచింది. ఏదో మాటామంతీ ఆడుకుంటూ పదినిమిషాలు గడిపాక "అన్నట్టు అసలు విషయం మరచాను. మీ వాళ్ళ అభిరుచులు ఎలా వుంటాయో నాకు బొత్తిగా తెలీదు. ఒక్కసారి మీరు వంటల దగ్గరకొస్తే తగినట్టు పురమాయించొచ్చు వంటవాళ్ళకి" అంటూ వంటల దగ్గరికి తీసుకెళ్ళింది వరలక్ష్మీదేవిగారి వియ్యపురాలు.

వంటవాడు సూరీ గుమ్మడిపళ్ళు తరుగుతున్నాడు. కత్తిపీట చుట్టూ గుమ్మడి గింజలు ముద్దగా పడివున్నాయి.

"ఈ గుమ్మడికాయ దేంట్లోకి" అన్నారు వరలక్ష్మీదేవి కాస్త చులకనగా.

"దప్పళంలోకట. మా అత్తగారు పెళ్ళికి దప్పళం లేందే యెలాగ యెన్ని వున్నా అదీ వుండితీరాలన్నారు."

"ఈ దప్పళాలు ఎవరు తింటారండీ బొత్తిగా లేబరు జనానికిగాని, చక్కగా కొబ్బరివేసి సాంబారు పెట్టించండి. మా వచ్చిన జనంలో లేబరు ఎవరూ లేరండోయి. ఫ్యాక్టరీ లేబరెవ్వర్నీ పిలవలేదాయన. అంతా చదువుకొన్న వాళ్ళు, పెద్దవాళ్ళూనూ. ఇంక తప్పదని లేబర్ యూనియన్ లీడర్నిమాత్రం పిలిచారు. అప్పుడప్పుడు ఫ్యాక్టరీ గొడవల్లో వాడితో పనిపడుతూ ఉంటుంది కదా అని. వంటలు కాస్త జాగ్రత్తగా చేయించండి. సాంబారుమాత్రం మానకండి. లేకపోతే మావాళ్ళు తినలేరు ఈ దప్పళాలు" అని ఝుణఝుణ లాడించేసింది వరలక్ష్మీదేవి.

"అలాగే దానిదేవుంది. యిదీ వుంటుంది ఆవిడ చాదస్తం. తృప్తికి సాంబారూ పెట్టిస్తాను మీ మాట ప్రకారం." అని సర్దేసింది ఛైర్మన్‌గారి భార్య.

ఇంతలో కదలబోతూన్న అమ్మ కొంగుపట్టుకొని, "అమ్మా; అది కావాలే" అంటూ గోముగా గుమ్మడిగింజలవైపు వేలుతో చూపిస్తూ వుండిపోయాడు చిట్టిబాబు.

"ఛీ! అవి తిండవేమిట్రా, అవేమైనా జీడిపప్పు పలుకులనుకున్నావా? బాదంపప్పు అనుకున్నావా? పద పద!"

"ఉహూ అవి నాకు కావాలి" అంటూ మారంచేశాడు చిట్టిబాబు.

"బోలెడంతపనిరా అవి తినడవంటేను. వాటికి బూడిద రాయాలి! వొలుచుకోవాలి. అది కాకపోయినా అవేం తింటావురా? విడిదిలో కేడ్‌బరీ చాక్లెట్లు వున్నాయి తిందువుగాని పద." అని మందలించారు వరలక్ష్మీదేవి చిట్టిబాబును.

చిట్టిబాబు పట్టు వదల్లేదు.

"పోనీలెండి. అవేమంత మారుభాగ్యం" అని పనిమనిషిని పిలిచి ఆ గింజలకి బూడిద రాయించి ప్లాస్టిక్ బాగ్‌లో పోయించి చిట్టిబాబు చేతికందించి తోడపెళ్ళికొడుకు ముచ్చట తీర్చింది వియ్యపురాలు.

చిట్టిబాబుని వెంటతీసుకుని మగపెళ్ళివారి విడిదికి వచ్చేసింది వరలక్ష్మి దేవిగారు. చిట్టిబాబు ఆ గుమ్మడిగింజల పొట్లాన్ని మాత్రం భద్రంగా వడిలో పెట్టుకొని, గట్టిగా పట్టుకుర్చున్నాడు.

కారు దిగి ఆవిడ లోపలికి వెళ్ళిపోయారు. చిట్టిబాబు వరండాలోనే ఆగిపోయి ఆడుకుంటున్న పిల్లలందర్నీ పోగుచేశాడు, తాయిలం తెచ్చాను తాయిలం తెచ్చానంటూ.

పొట్లంవిప్పి గింజలు దిమ్మరపోశాడు.

"ఒరేయ్; ఎవరూ ముట్టుకోకండి. మీకు ముందే చెబుతున్నాను. మీ కందరికీ ఒక్కొక్కడికి పదేసి గింజలిస్తాను. పదిగింజలూ వలిస్తే మీ కేమిస్తానో తెలుసా ?" అని అందరి ముఖాల్లోకి చూశాడు చిట్టిబాబు.

"ఏవిస్తావు ?" అనడిగాడు హెడ్‌గుమస్తాగారబ్బాయి రమణ. "పదిగింజలు వొలిచి నాకిస్తే, మూడుగింజలు వొలిచినవి మీ కిస్తాను. వొలవడానికి మళ్ళీ పది గింజలు యిస్తాను." అని వ్యాపారాన్ని వివరించాడు చిట్టిబాబు.

"ఓ అలాగే" అన్నాయి నాలుగైదు పిల్లకంఠాలు కోరస్‌గా.

లేబర్ లీడర్ నరసయ్య కొరకు రవి, హెడ్‌గుమస్తాకొడుకు రమణ, మిగిలిన గుమస్తాల పిల్లలు అయిదుగురు చిట్టిబాబుచుట్టూ కూర్చున్నారు. అందరికీ తలావొక పదిగింజలూ పంచియిచ్చి మిగిలిన గింజల్ని పొట్లంకట్టి చేతులు దులుపుకుని కూర్చున్నాడు చిట్టిబాబు.

ఓ కంట యిదంతా గమనిస్తున్న రావుజీ తన కొడుకు ఎంటర్‌ప్రైజింగ్ నేచర్ని చూసి లోలోపల పెద్ద బిజినెస్ మాగ్నెట్ అవుతాడు వాడు బతికిబాగుంటే అనుకున్నాడు.

"పది గింజలు వలిస్తే మూడు గింజలు జీతమా ?" అనుకున్నారు గుమస్తాలు.

"పైకి రావాలంటే అలా కష్టపడాలి మరి" అనుకున్నాడు హెడ్‌గుమస్తా.

"యిది దారుణం. వాళ్ళంతా స్ట్రయిక్‌చేసి అయిదు గింజలైనా యిమ్మనాలి పదిగింజలు వొలిచిచ్చినప్పుడు" అనుకున్నాడు యూనియన్ లీడర్ నరసయ్య.

రెండు మూడు గింజలు వొలిచేదాకా కొస్త కష్టంగానే వొలిచారు పిల్లలు.



అక్కడ్నించి వాళ్ళకి చేయితిరిగింది. యింతలో "ఎవరు త్వరగా పదిగింజలు వలిచేస్తారో వాళ్ళకి నాలుగు గింజలు" అని డిక్లేరు చేశాడు చిట్టిబాబు.

దాంతో ఆ పసివాళ్ళ వేళ్ళు చిలకముక్కుల్లా పనిచేశాయి. అయిదు నిముషాల్లో పదేసిగింజలూ వొలిచేశారంతా. ముందుగా పదిగింజలూ వొలిచేసింది హెడ్‌గుమస్తాగారబ్బాయి రమణ.

ముందుగా రమణే తను ఒలిచిన పదిగింజలూ చిట్టిబాబు ముందు వుంచాడు. చిట్టిబాబు వదిగింజలూ లెక్కపెట్టి తీసుకొని అన్నమాట ప్రకారం నాలుగు గింజలూ యిచ్చేశాడు రమణకి.

ఆ తరువాత నలుగురూ కూడా గింజలు ఒప్పజెప్పేసి మూడేసి గింజలు తీసుకున్నారు.

అయిదోవాడు కొత్తగా చేరిన గుమస్తా కొడుకు. వాడు బేరం మొదలెట్టాడు. "అయిదు గింజలు నీకు అయిదు గింజలు నాకూ, యేం ?" అన్నాడు అనునయంగా.

"ఏం వేళాకోళంగా వుందా ; ముందే చెప్పాగా నీకు మూడు, నాకు ఏడూ అని. నా గింజల్లో నాకే వాటా పెడుతున్నావా ?"

"మరి నే వొలిచే కాదేమిటి ?"

"వొలవబట్టే మూడు గింజలు నీవి, తెలిసిందా" గర్జించాడు చిట్టిబాబు.

"మరి నీ దగ్గరన్ని గింజలున్నాయి ఒలిచినవి, నువ్వొక్కటైనా వొలవలేదు."

"యిలాంటి వేషాలేస్తే నిన్ను వలవడంలోంచి తీసేస్తా. యిచ్చింది పుచ్చుకొని ఒలిస్తే వొలు లేకపోతే వీళ్ళే ఒలుస్తారు." బెదిరించాడు.

కొత్తగా చేరిన గుమస్తా రావుజీగారు డిస్టర్బ్ అవుతారేమో అన్న భయంతో "ఏమిట్రా అల్లరి ;" అని మందలించాడు కొడుకును. లోలోపల "ఆ హెడ్ గుమస్తా కొడుక్కిచ్చినట్టు తన కొడుక్కి నాలుగిస్తే ఏంపోయింది ఆ చిట్టిబాబుకి. అంతా పంతంగాని" అనుకున్నాడు.

తండ్రి గదమాయింపుకి దడసి మూడు గింజలూ తీసుకున్నాడు కొత్త గుమస్తా కొడుకు.

ఇంకా చివరికి మిగిలింది లేబర్ యూనియన్ లీడర్ నరసయ్య కొడుకు రవి.

"నే వొలుచుకున్న గింజలు నావే చిట్టిబాబూ. ఒక్క గింజకూడా నీ కివ్వను." అన్నాడు రవి కచ్చితంగా.

"యేం ఆటగా వుందా? గింజలు నీ సొంతవా?" అన్నాడు చిట్టిబాబు ఎర్రబడిన కళ్ళతో.

"నీకు మాత్రం సొంతవా యీ గింజలు. నువ్వు మీ అమ్మగారితో ముందు వెళ్ళావు కాబట్టి తెచ్చావు. మేం వెడితే మేమూ తెచ్చేవాళ్ళం." అన్నాడు రవి చాలా తేలిగ్గా.

"నువ్వు ముందు యిస్తావా యివ్వవా?"

"యివ్వనని చెప్పాగా. న్యాయంగా ఎవరు వొలిచిన గింజలు వాళ్ళవే. కావాలంటే నువ్వూ వొలుచుకో. ఒలవకుండా యింకొకళ్ళు ఒలిచినవి తినడానికి సిగ్గులేదూ?" అన్నాడు హేళనగా.

చిట్టిబాబుకి వళ్ళు మండిపోయింది. కళ్ళు ఎర్రబడ్డాయి. చెమ్మగిల్లుతున్నాయి. "ఏమిట్రా అన్నావు? నాకు సిగ్గులేదా?" అంటూ చెయ్యెత్తాడు.

రవికి ఇంక కోపం ఆగలేదు. పక్కకి తప్పుకొని చర్రున లేచాడు. నిజానికి రవి చిట్టిబాబంత బొద్దుగా వుండడు. కాని చిట్టిబాబంత మెత్తగాకూడ వుండడు. కోపం ఆపుకోలేక చిట్టిబాబు గుండెలమీద ఒక్కతాపు బలంకొద్దీ తన్ని, చిట్టిబాబు ముందున్న గింజలన్నిటినీ దోసెట్లోకి తీసుకొని "రండ్రా ఎవరు ఒలిచిన గింజలు వాళ్ళ కిచ్చేస్తాను" అని బయట కెళ్ళిపోయాడు. వెంట మిగిలిన పిల్లలంతా బిలబిలా వెళ్ళిపోయారు.

అంతా క్షణంలో జరిగిపోయింది, ఆ తాపుకి చిట్టిబాబు గుమ్మడిపండులా దిబ్బున వెనక్కిపడ్డాడు. ఆ చప్పుడికి రావుజీ వెనక్కితిరిగి చూశాడు. చిట్టిబాబు గుక్కపెట్టాడు.

"యేమిటిది నువ్వు చూస్తూ వూరుకున్నావు?" అన్నట్లు నరసయ్య కళ్ళలోకి చూశారు రావుజీ.

"నాలా స్ట్రయికులు సత్యాగ్రహాలు చేసి రూపాయితోటి రెండుతో తృప్తిపడ్డం వాడికి రాదండి. వాడు నేను కాదండి. వాడు నా కొడుకు, మన తరానికి ఓ తరం ముందున్న మరో తరంవాళ్ళు వాళ్ళు" అన్నట్టు చూశాడు యూనియన్ లీడర్ నరసయ్య.

——

# ఈ జీవితం నాది!

## సీరియల్

## 2

రాత్రి పొద్దుపోయింది.

ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి. చల్లటి గాలి కిటికీ కర్టెన్‌లని తోసుకుని బెడ్‌రూమ్‌లోకి రావాలని తాపత్రయపడుతోంది.

ప్రియంవద బెడ్‌రూమ్‌కి అనుకుని వున్న వరండాలో స్థంభానికి ఆనుకుని నిలబడి వుంది.

చీకట్లో ఆమె కట్టుకున్న తెల్లచీర తప్ప యింకేమీ కన్పించటంలేదు.

"ప్రియా!" బెడ్‌రూమ్‌కి వచ్చిన విక్రమ్ పిల్చాడు. ప్రియంవదకి ఆ పిలుపు వినిపించలేదో, వినిపించినా పలకాలనిపించలేదో, అలాగే మౌనంగా నిలబడి వుంది.

"ప్రియా!" విక్రమ్‌కంఠం ఆదుర్దాగా మరోసారి పిల్చింది.

అతను వరండా తలుపు తెరిచి వుండడం చూసి అక్కడికి వచ్చాడు.

అతనికి అక్కడ చీకట్లో దూరంగా, స్థంభం దగ్గర తెల్లగా లీలగా కనిపించింది. చప్పుడు చేయకుండా అక్కడికి వచ్చాడు.

ప్రియంవద యీ లోకంలో లేని దానిలా, శూన్యంలోకి చూస్తూ నిలబడి వుంది. మనసు వర్తమానం మరచి, గత స్మృతుల్లో ఎక్కడో చిక్కడిపోయినట్టుగా వుంది.

విక్రమ్ వెనక నుంచి వచ్చి, ప్రియంవద భుజాలని రెండు చేతులతో పట్టుకున్నాడు.

ప్రియంవద వులిక్కిపడలేదు. మెల్లగా యిటు తిరిగింది.

"ఒక్కదానివీ యిక్కడ నిలబడ్డావెందుకు?" అడిగాడు.

ప్రియంవద మాట్లాడలేదు. కాస్త దగ్గరకి జరిగి అతని గుండెలమీద తల ఆనించుకుంది.

"ప్రియా!" అతను పిల్చాడు. ఈసారి అతని గొంతు వెతుకుతున్నట్టు లేదు. లాలనగా వుంది.

"నువ్వు యింకా ఆ మూడ్‌లో నుంచి బైటపడలేదా?" తగ్గు స్వరంతో అన్నాడు.

యద్దనపూడి సులోచనారాణి